# అంతా పెద్దల ఆశీర్వచనం!

( క థా ని క )

ద్రోణంరాజు కృష్ణమోహన్

"ఏరోయ్ యోగానందం! తాతయ్య అయ్యావటే అప్పుడే!" నడి బజారులో కూరల సంచీ వూపుకుంటూ జగన్నాథం పలకరింపు.

యోగానందానికి మహా చెడ్డ సిగ్గేసింది. అబ్బ యిప్పటికి ఎన్ని వందలమంది అన్నారు, యీ ప్రశ్న వేయడం!

"ఆఁ మరేరా" నసుక్కుంటూ జవాబిచ్చాడు. ఇద్దరూ కాఫీ సేవించి చెరోదారి విడిపోయారు.

దోవ పొడుగునా యోగానందానికి ఆలోచనలే అప్పుడే తను తాతయ్యా! ముప్ఫైయారేళ్ళకే తాతయ్యా? ఒంట్లో వెనుకటి సత్తువలేదు, వుత్సాహం లేదు. ఏదో ఎప్పుడూ సంసారబాధలు, ఆలోచనలు. నాన్నే నయం. అయినా యీ వయస్సులో తను తాతయ్య కావడమేమిటి! బలే సిగ్గేస్తోంది పాడు. మొహం చూపించలేకుండా వున్నాడు ఎవరికీ.

హుఁ... తాతయ్య అయి కూర్చున్నాడు! ఎప్పటి తాతయ్య! ఏనాటి నాన్న! ఏనాటి పెళ్ళి, లక్ష్మితో! నిన్న మొన్న కదూ లక్ష్మితో సినిమాలకీ పార్కులకీ వెళ్ళింది..అల్లరిచూపుల కొంటె లక్ష్మి అప్పుడే ముప్ఫైరెండేళ్ళకే అమ్మమ్మ అయిందా! ఒక్కసారి గిరుక్కున బుర్రలో మెరిశాయి గత సంఘటనలు.

1942 ఆగస్టు ఉద్యమరోజులు. పోలీసు స్టేషనులో తిష్ఠవేశాడు. జెండా ఎగరేయాలి. పోలీసులు కదలమన్నారు. కదల్లేదు. అరెస్టయాడు మరి కొందరితో. అంతే రెండు నెలలు. హఠాత్తుగా ఒక రోజు విడుదలయ్యాడు. ఎందుకో కారణం తెలియదు. ఇంటి కెళ్ళాడు. స్నానం చేసి బట్టలు మార్చుకుని, కమ్మగా అమ్మ వండిన అన్నం తిని వాళ్ళు చెప్పినమీదట కారెక్కాడు.

"ఎక్కడికే అమ్మా?"

"డిపై. యస్. పి. గా రింటికి."

"ఎందుకూ ఆ వెధవల యింటికి?" కోపం.

"తప్పునాయనా. ఇక నీ అల్లర్లు కట్టిపెట్టు. పండంటి పిల్ల. రజస్వలై ఏడాదయింది. ఫోర్తు ఫారం ప్యాసయింది. గొప్ప హోదా. పెద్ద జీతం. కావలసిన కట్నం, సకల మర్యాదలున్నూ" ఇంకా ఏవేవో వర్ణించింది.

"అమ్మా నా ఆశయాలు"—వాక్యం ముగించలేదు తను. మాతృమూర్తి కళ్ళంబట నీళ్ళు జొటజొట కారాయి. నాన్న దీనంగా చూశాడు తన వంక, "చేసుకోవూ?" అన్నట్లు. అంతే. ఇహ తిరుగు జవాబులేదు. డిపై. ఎస్. పి. గారి అల్లుడై పోయాడు ఒక శుభముహూర్తాన. ఏడాది తిరగకముందే శ్రీమతి ఒక బంగారు బొమ్మను, ముద్దులు మూటగట్టే బుల్లెమ్మాయిని అందించింది. అంతే, ఇక బి ఏ. థర్డుపార్టు అలాగేవుండిపోయింది. 1946 నావికుల తిరుగుబాటు. దేశంలో ప్రదర్శనలు జోరుగా జరిగాయి. సభలో మాట్లాడుదామనుకున్నాడు యోగానందం. కనీసం వూరేగింపులో పాల్గొని అరవాలనుకొన్నాడు. పాపం ఉత్సాహం వురకలు వేసింది. కాని అప్పటికి డి. యస్. పి. గారి అల్లుడు! పేరుపడ్డ ప్లీడరుగారి కొడుకు! రికమెండేషన్లద్వారా త్వరలో పైకి రానున్న గుమాస్తా! నిరాశ!

"నాన్న సర్వీసులో వుండగానే చప్పున పైకి లాగుతారట. ఆ పార్టు కాస్తా పూర్తి చెయ్యకూడదూ?" శ్రీమతి సతాయింపు పడలేక ఒక శుభముహూర్తాన అది కాస్తా పూర్తిచేశాడు.

కూతురు శోభ, అల్లారుముద్దుగా పెరగడం, బెనారస్ మెట్రిక్ చదవడం, పద్నాలుగోయేడు ప్రవేశించడం జరిగింది. నాన్నకి దగ్గు, ఆయాసం. యీమధ్య వస్తోంది. ఆయనకి 58, అమ్మకి 53.

"ఒక్కకోరిక బాబూ"ఒకరోజన్నాడు నాన్న.

"చెప్పునాన్నా.నీమాట నేనెప్పుడు దాటాను?"

"ఇది నీ కుటుంబ విషయమే. అయినా ఏదో నా ముచ్చట, మీ అమ్మ ముచ్చట."

"అలాగే నాన్నా."

"ఏమీ లేదు. ఏదో మేమిద్దరం వుండగానే నీ పెద్దకూతురు పెళ్ళికాస్తా చూద్దామని."

"అప్పుడే దాని పెళ్ళేమిటి నాన్నా? ఇంకా పద్నాలుగేళ్ళేగా!"

"నువ్విలా అంటావని తెలుసు" నాన్న ఆదోలా అయిపోయాడు.

"మాముద్దు చెల్లించరా బంగారు తండ్రీ. ముని మనుమడిని చూసుకుని సరాసరి స్వర్గానికి వెడతాం."

ఏం చెప్పగలడు తను! అమ్మ బ్రతిమాలుతోంది. నాన్నకి బాధగా వుంటోంది తను ఎదురుచెపితే. మావగారికి కూడా తొందరగానే వున్నది. ఇక శోభ యిష్టం!

"ఏంతల్లీ?" అడిగాడు. సిగ్గుపడి పారిపోయింది.

"అయినా యిప్పుడెలా నాన్నా! నాకు ఆ సంబంధాలు, వాటి సంగతి ఏమీ తెలియదు" విసుగ్గా అన్నాడు.

"నీకెందుకురా ఆ శ్రమ. నేనింకా వున్నానురా నా చిట్టితండ్రీ!"

నాన్నకి, అమ్మకి తనంటే ఎంత ముద్దు! తను తాతయ్య కాబోతున్నా కూడా యింకా ఎక్కువవుతోంది.

"సరేలే." తల వూపాడు. ఆ వృద్ధ శరీరానికి వెయ్యేనుగుల బలంవొచ్చింది. వూరూరా తిరిగాడు, నాలుగు నెలలకంటె ఎక్కువ పట్టలేదు. రిటైర్ కాబోతున్న డి. యస్. పి. గారి మనుమరాలు! మరోవైపు బాగా సంపాదించిన ప్లీడరుగారి మనుమరాలు! డిప్యూటీ కమ్మర్షియల్ టాక్సు ఆఫీసరుగారి అమ్మాయి!

అన్ని వైభవాలతో పెళ్ళి జరిగిపోయింది. ఆదేమి అదృష్టమో! ఏడాది గిరుక్కున తిరిగిందో లేదో తను తాతయ్య! పండంటి మనుమడు! అల్లుడుగారు తనింట్లోనే మకాం, తన ఆఫీసులోనే వుద్యోగం.

* * *

ఇవన్నీ స్ఫురణకొచ్చేసరికి యోగానందానికి బుర్ర ఆదోలా అయిపోయింది. ఒక్కసారి పక్కకి తిరిగిచూశాడు. తన యిల్లుదాటి యివతలికొచ్చేశాడు. మళ్ళీ వెనక్కి వెళ్ళాడు.

రాత్రి తెల్లవార్లూ యోగానందానికి నిద్రలేదు. శ్రీమతికి అంతకన్నా. ఇద్దరూ విసుక్కుని పిల్లాడిని తీసికెళ్ళి తల్లికందిచ్చారు.

"అబ్బ! వీడేడుస్తున్నాడే అమ్మా" లోపల నుంచి మరో అరగంటకల్లా పిలుపు. శ్రీమతి లేవదు. తనకంతకన్నా బద్ధకం. ఇదే వరుస. పైగా తెల్లవార్లు యిలా సతమతమైతే, తెల్లవారుజామున ఐదుగంటలకే నాన్న లేచి రోజూగోవిందనామాలు. పొద్దున్నే ఐదుమైళ్లు నడుస్తాడు. వచ్చేసరికి అమ్మ కాఫీ కూడా చేస్తుంది. ఎంత వోపిక ముసలి వాళ్ళకి!

"ఏవమ్మోవ్! ఓ యింటి కోడలా! లే లే. నీ మనవడుగారు పిలుస్తున్నారు" ప్రొద్దున్నే చన్నీళ్లు తలనిండా పోసుకుని కాఫీ కాస్తూ శ్రీమతికి అత్తగారి పిలుపు.

"అబ్బ! లేస్తున్నా అత్తయ్యా, కాస్త దానిని చూడమనరాదుటండీ!" గొణుగుడు.

"అదేవిటే! మా మనవరాల్ని మేం పెంచడం అయింది. నీమనవడిని నువ్వూ మీ ఆయనా పెంచుకోవద్దూ?" మావగారిమాట విని లేచింది. అమ్మవచ్చి గుమ్మంలో నుంచుని నవ్వుతూ—

"మనం బ్రతికుండగా, మన నాయన తాతయ్యగానివ్వండి, ముత్తాతగానివ్వండి, వాడు మనకి చంటిపిల్లాడే" అంది.

"తప్పుతుందా. ఇటివ్వు కుర్రాడిని. నేను బ్రతికుంటే నా మునిమనుమనికి కూడా ఒక జిల్లా జడ్జీ కూతుర్నో, రాజకుమార్తెనో తెచ్చి పెళ్ళి చెయ్యనూ. నా తండ్రిని కష్టపడనిస్తానా" అంటూ పిల్లాడినందుకుని యింకా మంచంమీదే వున్న కొడుకు యోగానందాన్ని—కాదు యోగానందం తాతయ్యని—చూశాడు.

తాతయ్య సిగ్గుతో కళ్లుమూసుకున్నాడు మొహం తుడుచుకుంటున్న అమ్మమ్మ మరీనూ!.

"నా మనుమడి పెళ్ళి అయ్యేవరకూ బ్రతికుండు నాన్నా!" మనసులో ప్రార్థించుకున్నాడు యోగానందం తాతయ్య!

(ఈ కథాకాలం 1958 లో అనుకుంటే సందేహాలు రావు.—రచయిత.) ★